# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ అయోధ్య బాలరామున్ని తొలిసారిగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.**
2. **బీజేపీ నాయకులు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్నత విద్యలోని వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి మేలో నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను ఉన్నత విద్యా మండలి వెల్లడించింది.**
4. **తెలంగాణాలో మే 13 వ తేదీన జరిగే లోక్ సభ ఎన్నికల పోలింగ్ సమయాన్ని పొడిగిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.**
5. **తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్- ఐసెట్ దరఖాస్తులకు గడువును పొడిగించారు.**

==========================

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ నిన్న అయోధ్యలో పర్యటించారు. నూతన మందిరంలో కొలువుదీరిన బాలరామున్ని తొలిసారిగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరయూ నది హారతి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి నదికి పూలమాలలు సమర్పించారు. అనంతరం హనుమాన్ గఢ్ ఆల యాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కాగా నూతన రామాలయం నిర్మాణం అనంతరం రాష్ట్రపతి అయోధ్యలో తొలిసారిగా పర్యటించారు.

--------------------------

బీజేపీ నాయకులు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ రోజు ఆంధ్రప్రదేశ్ లో పర్యటించనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి .ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ రోజు ఉదయం పార్వతీపురం మన్యం జిల్లా వెంకంపేటలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని, అనంతరం విశాఖపట్నం జిల్లాలోని వేపగుంట వద్ద జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

--------------------------

తెలంగాణా రాష్ట్రంలో మే 13 వ తేదీన జరిగే లోక్ సభ ఎన్నికల పోలింగ్ సమయాన్ని పొడిగిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ రోజు ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపింది. ఈ మేరకు నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఎండల తీవ్రత దృష్ట్యా ఈ

నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

---------------------------

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపి సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. ఈ నెల 8, 10 తేదీల్లో ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటన ఖరారైందని… 8న వేములవాడ, వరంగల్ సభలకు హాజరుకానున్నారని బీజేపి పార్టీ వర్గాలు తెలిపాయి. 10న మహబూబ్ నగర్ తో పాటు హైదరాబాద్ ఎల్బీ క్రీడా మైదానంలో నిర్వహించే బహిరంగసభలోనూ నరేంద్ర మోదీ పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయలేదని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… తాము అధికారంలోకి వచ్చాక చంద్రన్న బీమా అమలు చేస్తామన్నారు. ప్రతీ కుటుంబానికి ఆరోగ్య బీమాతో పాటు అందరికీ డిజిటల్ హెల్త్‌కార్డులు జారీ చేస్తామని తెలిపారు. మండల కేంద్రాల్లో జనరిక్ ఔషధ కేంద్రాలను ఏర్పాటుచేసి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని జనసేన అధినేత కె. పవన్ కల్యాణ్ తెలిపారు. అనకాపల్లి జిల్లా పెందుర్తి, ఎలమంచిలి నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ హక్కుల కోసం పోరాడితే ప్రజలపై కేసులు పెట్టారన్నారు. ఎన్నికల్లో ప్రతి ఓటు చాలా విలువైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కూటమికి మద్దతుగా నిలవాలని కోరారు.

---------------------------

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 525 మంది పోటీలో ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. సికింద్రాబాద్‌లో అత్యధికంగా 45 మంది, ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 12 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని తెలిపారు. 285 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నట్లు వివరించారు. అభ్యర్థుల సంఖ్య దృష్ట్యా ఏడు స్థానాల్లో మూడు ఈవీఎంలు, 9 స్థానాల్లో రెండు ఈవీఎంలు ఉపయోగించనున్నట్లు తెలిపారు. అన్నిచోట్లా ఓటరు స్లిప్పుల పంపిణీ జరుగుతోందని, శుక్రవారం నుంచి హోం ఓటింగ్ ప్రారంభం కానుందని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 35 వేల 809 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో 3 వేల 986 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2.94 లక్షల మంది ఎన్నికల సిబ్బందిని వినియోగిస్తున్నట్లు వికాస్‌రాజ్ వివరించారు.

---------------------------

ఈ ఏడాది ఏప్రిల్‌లో స్థూల వస్తు, సేవల పన్ను… జీఎస్‌టీ వసూళ్లు గతంలో ఎన్నడూ లేని విధంగా 2 లక్షల 10 వేల కోట్ల రూపాయలుగా నమోదైందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశీయ లావాదేవీలు, దిగుమతులలో బలమైన పెరుగుదల కారణంగా 12.4 శాతం వృద్ధి నమోదైందని తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో వసూళ్లు చేసిన మొత్తంలో కేంద్ర వస్తు సేవల పన్ను 43 వేల కోట్ల రూపాయలు కాగా, రాష్ట్ర వస్తు సేవల పన్ను 53 వేల కోట్లుగా నమోదైందని… అలాగే ఇంటిగ్రేటెడ్ వస్తు, సేవల పన్నువసూళ్లు 99 వేల కోట్ల రూపాయలు కాగా… సెస్ వసూళ్లు 13 వేల కోట్ల రూపాయలుగా నమోదయ్యాయని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్నత విద్యలోని వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి మేలో నిర్వహించే

ప్రవేశ పరీక్షల తేదీలను ఉన్నత విద్యా మండలి కార్యదర్శి నాజీర్ అహ్మద్ నిన్న వెల్లడించారు. ఈ రోజు నుంచి 5వ తేదీ వరకు ఆర్సెట్, 6న ఐసెట్, 8న ఈసెట్ పరీక్ష జరుగుతాయని వెబ్ సైట్ లో హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే మే 16 నుంచి 23 వరకు నిర్వహించే ఏపీఈఏపీ సెట్‌కు సంబందించిన హాల్ టికెట్లు మే 7వ తేదీ నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. మే 29 నుంచి 31వరకు నిర్వహించే పీజీ సెట్ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను మే 22 నుంచి ఎచీం.ఖజూంఎష్ట్రవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా పొందాలని సూచించారు.

-------------------------

తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్- ఐసెట్ దరఖాస్తులకు గడువును పొడిగించారు. మార్చి 5న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 30 వ తేదీతో దరఖాస్తులకు గడువు ముగియగా... ఆ గడువును మే 7 వరకు పొడిగిస్తున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి తెలిపింది. ఆలస్య రుసుం లేకుండా మే 7 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఐసెట్ కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5, 6 తేదీల్లో జరిగే ఈ పరీక్షకు 250 రూపాయల ఆలస్య రుసుంతో మే 17 వరకుబీ 5 వందల రూపాయల ఆలస్య రుసుంతో మే 27 వరకు దరఖాస్తు చేసుకొవచ్చని తెలిపారు. మే 28న హాల్‌టికెట్లు అందుబాటులోకి తెస్తామని, జూన్ 28న ఫలితాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

-------------------------

పోలింగ్ కేంద్రాలకు అత్యంత పారదర్శకంగా ఓటింగ్ యంత్రాలను కేటాయించామని బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రంజిత్ భాషా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్, ఖాజన్ సింగ్ సమక్షంలో నిన్న రెండో విడత ఓటింగ్ యంత్రాల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల పార్లమెంటు పరిధిలోని 1,766 పోలింగ్ కేంద్రాలకు 2,166 బ్యాలెట్ యూనిట్లు, 2,166 కంట్రోల్ యూనిట్లు, 2,528 వివిప్యాట్స్ యంత్రాలను కేటాయించామని తెలిపారు.

-------------------------

ఓటర్లు తమ ఓటు ఎక్కడుందో తెలుసుకునేందుకు ఓటర్ హెల్ప్ లైన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం. హరి నారాయణన్ తెలిపారు. నెల్లూరులో ఓటర్ హెల్ప్ లైన్ కేంద్రాన్ని అధికారులతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నెల్లూరు నగరంతో పాటు జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాలలో ఓటర్ హెల్ప్ లైన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫోన్ లేనివారు సమీపంలోని ఓటర్ హెల్ప్ లైన్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు ఎక్కడుందో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

-------------------------

తెలంగాణా రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు కె. చంద్ర శేఖర రావు ఎన్నికల ప్రచారంపై రాష్ట్ర ఎన్నికల సంఘం 48 గంటల పాటు నిషేధం విధించింది. గత రాత్రి ఎనిమిది గంటల నుండి ఈ నిషేధం 48 గంటల పాటు ఈ ఉంటుందని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. సిరిసిల్ల పట్టణంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీ నేతలను ఉద్దేశించి చంద్ర శేఖర రావు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని... ఈ వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి చేసిన ఫిర్యాదుపై చంద్ర శేఖర రావు నుండి వివరణ తీసుకున్న అనంతరం ఎన్నికల సంఘం ఆయన ప్రచారం పై 48 గంటల నిషేధం విధించింది.

====================